ప్రారంభ లాభాలు ఆవిరి

ముంబై, సెప్టెంబర్ 5: స్టాక్ మార్కెట్ల ప్రారంభ లాభాలు ఆవిరైపోయాయి. బ్లూచిప్ సంస్థల షేర్లు నష్టపోవడం, గ్లోబల్ మార్కెట్ల నుంచి వచ్చిన ప్రతికూల సంకేతాలతో చివర్లో మదుపరులు అమ్మకాలకు మొగ్గుచూపారు. ఫలితంగా ప్రారంభంలో భారీగా లాభపడిన సూచీలు ఇంట్రాడేలో 222 పాయింట్లు నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 151.48 పాయింట్ల నష్టంతో 82,201.16 వద్ద నిలిచింది. మరో సూచీ నిఫ్టీ 53.60 పాయింట్లు తగ్గి 25,145.10 వద్ద స్థిరపడింది. తీవ్ర ఊగిసలాటలో కదలాడిన స్టాక్ మార్కెట్లలో బ్లూచిప్ సంస్థలైన రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు నష్టపోవడం సూచీల పతనానికి ప్రధాన కారణమని దలాల్ స్ట్రీట్ వర్గాలు వెల్లడించాయి. సూచీల్లో రిలయన్స్ అత్యధికంగా ఒక్క శాతానికి పైగా నష్టపోయింది. దీంతోపాటు టాటా మోటర్స్, నెస్లె, భారతీ ఎయిర్‌టెల్, బజాజ్ ఫైనాన్స్, లార్సెన్ అండ్ టుబ్రో, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, మహీంద్రా అండ్ మహీంద్రాలు అత్యధికంగా నష్టపోయాయి. కానీ, టైటాన్, ఐటీసీ, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టాటా స్టీల్, ఎస్బీఐలు లాభాల్లో ముగిశాయి.

1:1 బోనస్ షేర్లకు సై

ఆమోదించిన రిలయన్స్ బోర్డు • ఏడేండ్ల తర్వాత ఇప్పుడే

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 5: వాటాదారులకు రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) వినాయక చవితి పండుగ కానుకను అందించింది. 1:1 బోనస్ షేర్ల జారీకి ఆ సంస్థ బోర్డు గురువారం ఆమోదం తెలిపింది. ఈ మేరకు రెగ్యులేటరీ ఫైలింగ్‌లో రిలయన్స్ పేర్కొన్నది. ప్రస్తుతం షేర్‌హోల్డర్ల వద్ద ఉన్న రూ.10 విలువైన ప్రతీ ఫుల్ పెయిడ్-అప్ ఈక్విటీ షేర్‌కు సమాన విలువలో మరో ఫుల్లీ పెయిడ్-అప్ ఈక్విటీ షేర్‌ను ఉచితంగా ఇచ్చేందుకు తమ కంపెనీ బోర్డు సిఫార్సు చేసినట్టు బిలియనీర్ ముకేశ్ అంబానీ నేతృత్వంలోని ఆర్ఐఎల్ ప్రకటించింది. ప్రస్తుతం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ)లో రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్ విలువ రూ.2,987.15 వద్ద ముగిసింది. బుధవారం ముగింపుతో పోల్చితే 1.41 శాతం దిగజారింది.



ఏడేండ్ల తర్వాత..

రిలయన్స్ ఇన్వెస్టర్లకు ఇలా 1:1 నిష్పత్తిలో బోనస్ షేర్లు దక్కడం గడిచిన ఏడేండ్లలో ఇదే తొలిసారి. ఇంతకుముందు 2017 సెప్టెంబర్‌లో ఇలాగే 1:1 బోనస్ షేర్లను కంపెనీ ఇష్యూ చేసింది. నాడు కంపెనీ షేర్ ధర దాదాపు రూ.700లుగా ఉన్నది. అంతకు ముందు 2009-10లో వాటాదారులకు 1:1 బోనస్ షేర్లు దక్కాయి. అయితే తొలి బోనస్ 1980-81లో జారీ అయ్యింది. 3:5 నిష్పత్తిలో ఇచ్చారు. ఆ తర్వాత 1983-84లో 6:10తో ప్రకటించారు. 1:1 నిష్పత్తిలో మాత్రం తొలిసారి 1997-98లో జారీ చేశారు. మొత్తంగా రిలయన్స్ ఐపీవో దగ్గర్నుంచి ఇన్వెస్టర్లకు ఇది 6వ బోనస్. ప్రస్తుతం దేశీయ అతిపెద్ద కంపెనీగా రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఉన్న విషయం తెలిసిందే. నిజానికి ఇటీవల నిర్వహించిన కంపెనీ వార్షిక సాధారణ సమావేశంలోనే ఈ 1:1 బోనస్ షేర్ల జారీ ప్రకటన అధికారికంగా వెలువడింది. అయితే తాజాగా జరిగిన బోర్డు సమావేశంలో దానికి ఆమోద ముద్ర పడింది. కాగా, ఈ బోనస్ షేర్ల జారీ కోసం రికార్డు తేదీని త్వరలో ప్రకటించనున్నారు. ఇదిలావుంటే కంపెనీ ఆథరైజ్డ్ షేర్ క్యాపిటల్‌ను రూ.15,000 కోట్ల నుంచి రూ.50,000 కోట్లకు పెంచుకోవడానికి కూడా కంపెనీ బోర్డు ఈ సందర్భంగా అనుమతిచ్చింది. దీంతో షేర్ హోల్డర్ల అనుమతిని సంస్థ కోరుతున్నది.



జియో వార్షికోత్సవ ఆఫర్లు

దేశీయ టెలికం రంగ దిగ్గజం రిలయన్స్ జియో.. 8వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం తమ కస్టమర్లకు పలు రిచార్జ్ ప్లాన్లపై ఆఫర్లను ప్రకటించింది. జియో.కామ్ వెబ్‌సైట్ వివరాల ప్రకారం ఈ నెల 5 నుంచి 10వ తేదీ మధ్య ఎవరైతే 3 నెలల ప్లాన్లు, ఏడాది ప్లాన్‌ను రిచార్జ్ చేసుకుంటారో వారికి రూ.700 విలువైన 3 ప్రయోజనాలను అందిస్తున్నట్టు తెలిపింది. వీటిలో 10 ఓటీటీలు, రూ.175 విలువైన 28 రోజుల వ్యాలిడిటీ గల 10జీబీ డాటా ప్యాక్, ఉచిత జొమాటో 3 నెలల గోల్డ్ మెంబర్‌షిప్ ఉన్నాయి. కాగా, రూ.899, రూ.999లతో ఉన్న త్రైమాసిక ప్లాన్లు.. రూ.3,599తో ఉన్న వార్షిక ప్లాన్లకే ఈ ప్రయోజనాలు వర్తిస్తాయి. త్రైమాసిక ప్లాన్లలో కస్టమర్లకు రోజూ 2జీబీ డాటా ఉంటుంది. ఇక రూ.899 ప్లాన్ గడువు 90 రోజులైతే.. రూ.999 ప్లాన్ కాలవ్యవధి 98 రోజులు. అలాగే రూ.3,599 ప్లాన్ గడువు 365 రోజులు. రోజూ 2.5జీబీ డాటాను వాడుకోవచ్చు. 2016 సెప్టెంబర్‌లో ఉచిత వాయిస్ కాల్స్, చౌక ధరలకే ఇంటర్నెట్ సేవలతో భారతీయ టెలికం రంగంలోకి జియో సంచలనాత్మక ప్రవేశం చేసిన విషయం తెలిసిందే. 2జీ, 3జీలను పక్కనబెట్టి 4జీతో పరిచయమైంది. ఈ క్రమంలోనే కేవలం 170 రోజుల్లోనే 10 కోట్ల కస్టమర్ల మార్కును జియో తాకింది. అంతేగాక జియోఫోన్ (ఇంటిలిజెంట్ స్మార్ట్‌ఫోన్), జియోభారత్ (అల్ట్రా-అఫర్డబుల్ 4జీ ఫోన్), జియో ఫైబర్, ఎయిర్‌ఫైబర్ (ఫిక్స్‌డ్ వైర్‌లెస్ బ్రాడ్‌బాండ్ ఆఫర్), పూర్తిస్థాయిలో 5జీ సర్వీసులనూ అందుబాటులోకి తెచ్చింది. ఇటీవలి వార్షిక వాటాదారుల సమావేశంలో జియో యూజర్ల కోసం 100జీబీదాకా ఉచిత క్లౌడ్ స్టోరేజీని కూడా ముకేశ్ అంబానీ ప్రకటించిన సంగతి విదితమే. ఏఐ సాంకేతికతతో వివిధ ఫీచర్లను కస్టమర్లకు అందిస్తున్నట్టూ పేర్కొన్నారు.

బుచ్ రాజీనామా చేయాలి

సెబీ ప్రధాన కార్యాలయంలో ఉద్యోగుల నిరసనలు

ముంబై, సెప్టెంబర్ 5: క్యాపిటల్ మార్కెట్స్ రెగ్యులేటర్ సెబీ ప్రధాన కార్యాలయంలో గురువారం ఉద్యోగులు నిరసనల బాట పట్టారు. అవినీతి ఆరోపణల్ని ఎదుర్కొంటున్న సెబీ చీఫ్ మాధబీ పురి బుచ్ రాజీనామాను కోరుతూ ఇక్కడి బాంద్రా కుర్లా కాంప్లెక్స్‌లోగల హెడ్ ఆఫీస్ ఎదుట పెద్ద ఎత్తున మౌన ప్రదర్శన ఇచ్చారు. బుచ్‌తోపాటు ఈ వ్యవహారంలో ఉన్న ఇతర అధికారుల కార్యాలయాల ముందూ నిరసనల్ని వ్యక్తం చేశారు. ఇందులో 200 మందికిపైగా పాల్గొన్నట్టు అంచనా. వీరిలో ఎవరూ మీడియా ముందు మాట్లాడలేదు. కానీ బుధవారం సెబీ విడుదల చేసి పత్రికా ప్రకటనను ఉపసంహరించుకోవాలని, సెబీ చీఫ్ రాజీనామా చేయాలని నినదించారు. సుమారు గంటన్నరపాటు ఈ నిరసనలు కొనసాగాయి. నిజానికి గతంలోనూ ఇదే తరహాలో సెబీ ప్రధాన కేంద్రం వద్ద ఆందోళనలు జరిగాయి. అయితే వాటికి, ఉద్యోగులకు ఎలాంటి సంబంధం లేదని అక్కడి ఉన్నతాధికారులు కొట్టిపారేశారు. ఆ నేపథ్యంలో తాజా ఉద్యోగుల నిరసన మిక్కిలి ప్రాధాన్యాన్ని సంతరించుకుంటున్నది. అదానీ గ్రూప్ వ్యవహారంలో బుచ్ పాత్ర కూడా ఉందని, విదేశాల్లోని కొన్ని సంస్థల్లో ఆమెకు, ఆమె భర్తకు వాటాలున్నాయని అమెరికాకు చెందిన హిండెన్‌బర్గ్ బయటపెట్టింది. అప్పట్నుంచి బుచ్ వార్తల్లో నిలుస్తున్నారు. ఈ క్రమంలోనే ఆగస్టు 6న కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు సెబీలో దారుణమైన పరిస్థితులు నెలకొన్నాయని, ఉన్నతాధికారుల తీరు అస్సలు బాగాలేదంటూ దాదాపు 500 మంది ఉద్యోగులు లేఖ రాశారు. దీనిపై మీడియాలో వార్తలు రావడంతో సెబీ ఓ పత్రికా ప్రకటనను విడుదల చేస్తూ అంతా ఉట్టిదేనంటూ కొట్టిపారేసింది. ఇది ఉద్యోగులకు మరింత ఆగ్రహాన్ని తెచ్చిపెట్టింది.

సహారా రూ.1,000 కోట్లు కట్టాలి

సహారా గ్రూప్.. ఓ ప్రత్యేక ఎస్క్రో ఖాతాలో 15 రోజుల్లోగా రూ.1,000 కోట్లను డిపాజిట్ చేయాలని సుప్రీం కోర్టు గురువారం ఆదేశించింది. అలాగే రూ.10,000 కోట్ల డిపాజిట్ కోసం ముంబైలోని వార్సోవా వద్దనున్న భూమి అభివృద్ధికి జాయింట్ వెంచర్ ఏర్పాటుకు అనుమతించింది.

ఈవీల సంస్థలకు రాయితీలు అవసరం లేదు

కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 5: విద్యుత్‌తో నడిచే వాహన తయారీ సంస్థలకు రాయితీలు ఇవ్వాల్సిన అవసరం లేదని కేంద్ర రవాణా మంత్రి నితిన్ గడ్కరీ స్పష్టంచేశారు. ప్రస్తుతం కొనుగోలుదారులు సొంతంగా ఈవీలు లేదా సీఎన్‌జీ వాహనాలను ఎంచుకునే స్థాయికి చేరుకున్నారని బీఎన్‌ఈఎఫ్ సమ్మిట్‌లో చెప్పారు. ప్రారంభంలో ఈవీల తయారీదారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రత్యేకంగా రాయితీలు ప్రకటించినట్లు, ఆ తర్వాతి క్రమంలో వీటికి డిమాండ్ ఊపందుకున్నదని, దీంతో ఉత్పత్తిపై పెట్టే ఖర్చులు తగ్గుముఖం పట్టడంతో సంస్థలకు ఇచ్చే రాయితీలు అనవసరమని మంత్రి వ్యాఖ్యానించారు. పెట్రోల్, డీజిల్ వాహనాల కంటే ఎలక్ట్రిక్ వాహనాలపై విధిస్తున్న జీఎస్టీ తక్కువ స్థాయిలో ఉన్నదన్నారు. హైబ్రిడ్స్ వాహనాలతోపాటు పెట్రోల్, డీజిల్ వాహనాలపై 28 శాతం జీఎస్టీని వసూలు చేస్తుండగా, అదే ఎలక్ట్రిక్ వాహనాలపై 5 శాతం విధిస్తున్నారు.

మెర్సిడెజ్ బెంజ్..మరో ఎలక్ట్రిక్ మాడల్‌ను దేశీయ మార్కెట్‌కు పరిచయం చేసింది. మేబ్యాచ్ ఈక్యూస్ 680 ఎస్‌యూవీ ప్రారంభ ధర రూ.2.25 కోట్లుగా నిర్ణయించింది. ఈ ధరలు ముంబై షోరూంనకు సంబంధించినవి. 107.8 కిలోవాట్ల బ్యాటరీ ప్యాక్‌తో తయారైన ఈ మాడల్ సింగిల్ చార్జింగ్‌తో 611 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. కేవలం 4.4 సెకండ్లలో 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్న ఈ మాడల్ గంటకు 210 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. కేవలం అరగంటలోనే 80 శాతం వరకు చార్జింగ్ కానున్నది.

రాష్ట్ర ప్రభుత్వంతో నజారా టెక్ జట్టు

హైదరాబాద్, సెప్టెంబర్ 5: గేమింగ్, ఈ-స్పోర్ట్స్ కంపెనీ నజారా టెక్నాలజీస్..రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందాన్ని కుదుర్చుకున్నది. ఈ ఒప్పందంలో భాగంగా గేమింగ్, డిజిటల్ ఎంటర్‌టైన్‌మెంట్ విభాగంపై మరింత దృష్టి సారించడానికి ఏఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేయబోతున్నది. 'నజారా ఏఐ సీవోఈ' పేరుతో ఏర్పాటు చేస్తున్న ఎక్సలెన్స్ సెంటర్‌తో రీసర్చ్, డెవలప్‌మెంట్, ఇన్నోవేషన్‌లపై మరింత దృష్టి సారించడంతోపాటు గేమింగ్, ఇంటరాక్టివ్ మీడియా, గేమిఫైల్డ్ లెర్నింగ్, ఇతర డిజిటల్ కంటెంట్, బ్లాక్‌చెయిన్, వెబ్3.0లపై దృష్టి సారించడానికి వీలు పడనున్నదని నజారా టెక్నాలజీ జాయింట్ ఎండీ, సీఈవో నితీష్ మిట్టర్సేన్ తెలిపారు. మరోవైపు, ఈ-గవర్నెన్స్, కృత్రిమ మేధస్సు సాంకేతికతలను వినియోగించి పౌర సేవలు అందించడానికి రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేయనున్నట్లు సోషల్ మీడియా దిగ్గజం మెటా ప్రకటించింది.



ఫార్మా విలేజీల్లేవ్.. క్లస్టర్లే!

1,000-2,000 ఎకరాల్లో ఏర్పాటుకు ప్రభుత్వ యోచన
భూములు ఇచ్చేందుకు స్థానికులు ససేమిరా..

హైదరాబాద్, సెప్టెంబర్ 5(నమస్తే తెలంగాణ): ఫార్మాసిటీ స్థానంలోనే ఫార్మా క్లస్టర్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నది. సుమారు 1,000 నుంచి 2,000 ఎకరాల స్థలంలో ఈ క్లస్టర్‌ను ఏర్పాటు చేసేయోచనలో సర్కార్ ఉన్నది. ఇందుకు సంబంధించి అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. సుమారు రూ. లక్ష కోట్ల పెట్టుబడితో 10 ఇంటిగ్రేటెడ్ గ్రీన్‌ఫీల్డ్ ఫార్మా విలేజ్‌లను ఏర్పాటు చేస్తామని ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన బయోఏషియా-2024 సదస్సు సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన విషయం విదితమే. ముందుగా వికారాబాద్, మెదక్, నల్గొండలలో ఈ విలేజ్‌లను ఏర్పాటు చేయనున్నట్లు, ఒక్కో విలేజ్‌ను వెయ్యి నుంచి రెండు వేల ఎకరాల్లో ఉంటుందని ఆయన తెలిపారు. అయితే ఈ మూడు జిల్లాల్లో ఒకే చోట 1000ఎకరాల భూమి అందుబాటులో లేదని కలెక్టర్లు తేల్చిచెప్పడంతో రాష్ట్ర సర్కార్ దీనిపై పునరాలోచనలో పడినట్లు తెలుస్తున్నది. కానీ ఎలాగైన వికారాబాద్‌లో ల్యాండ్ పూలింగ్ పద్ధతిలోనైనా ఫార్మా విలేజ్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నది. అయితే, అధికారులు క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లడం ఆలస్యం కావడం, భూములు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇచ్చేదిలేదని స్థానికులు తేల్చిచెప్పడంతోపాటు వారిని చుట్టుముట్టి ఆందోళన నిర్వహించారు. అయినప్పటికీ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పరిశ్రమలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఫార్మాసిటీ కోసం గతంలో వచ్చిన దరఖాస్తులు పెద్ద సంఖ్యలో పెండింగ్‌లో ఉండటంతో ఆయా పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా అవసరమైతే 2,000 ఎకరాల వరకైనా ఫార్మా క్లస్టర్‌ను అభివృద్ధి చేయాలనుకుంటున్నారు. అయితే, గతంలో ప్రతిపాదిత ఫార్మాసిటీలో అన్ని రకాల ఔషధ పరిశ్రమల ఏర్పాటునకు వెసులుబాటు కల్పించాలని నిర్ణయించగా, తాజాగా ప్రతిపాదిత ఫార్మా క్లస్టర్‌లో కాలుష్యం కలిగించే బల్క్‌డ్రగ్ పరిశ్రమలను మినహాయించాలని నిర్ణయించారు. ఫార్మారంగంలో తెలంగాణ రాష్ట్రానికి, ముఖ్యంగా హైదరాబాద్‌కు ఉన్న ప్రత్యేకతను సుస్థిరం చేసే విధంగా గత బీఆర్ఎస్ సర్కారు రంగారెడ్డి జిల్లా ముచ్చర్లలో సుమారు 14,029ఎకరాల్లో ఫార్మాసిటీ ఏర్పాటునకు ప్రతిపాదించినది తెలిసిందే. మొదటి దశలో 8,900ఎకరాల్లో ఔషధ పరిశ్రమల ఏర్పాటునకు అవసరమైన ప్రణాళికలను కూడా గత ప్రభుత్వం సిద్ధం చేసింది. ఫార్మాసిటీలో సుమారు రూ. 64,000 కోట్ల పెట్టుబడులు, తద్వారా 4.20 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని అంచనావేసింది.

మలబార్ గోల్డ్ 20 షోరూంలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 5: మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్.. భారత్‌లో వ్యాపారాన్ని శరవేగంగా విస్తరిస్తున్నది. వచ్చే నెలలో దేశవ్యాప్తంగా 20 షోరూంలను ప్రారంభించబోతున్నది. వీటిలో ఉత్తరప్రదేశ్‌లో మూడు, ఢిల్లీ, మహారాష్ట్ర, కర్ణాటక, రాజస్థాన్‌లలో రెండేసి చొప్పున..ఒడిశా, తెలంగాణ, బెంగాల్, పంజాబ్‌లలో ఒక్క షోరూంను ప్రారంభించాలనుకుంటున్నట్లు మలబార్ గ్రూపు చైర్మన్ ఎంపీ అహ్మద్ తెలిపారు. దీంతోపాటు షార్జా, ఖతార్, సౌదీ అరేబియా, ఉత్తర అమెరికాల్లో నూతన షోరూంలు అందుబాటులోకి తీసుకురానున్నది.

మీషోలో 8.5 లక్షల ఉద్యోగాలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 5: ప్రస్తుత పండుగ సీజన్‌లో మరో ఈ-కామర్స్ సంస్థ మీషో భారీ స్థాయిలో ఉద్యోగులను నియమించుకోవడానికి సిద్ధమైంది. విక్రయదారులు, లాజిస్టిక్ సేవల పరిధిలో 8.5 లక్షల మంది సీజనల్ సిబ్బందిని రిక్రూట్ చేసుకోనున్నట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. వీరిలో అత్యధిక మంది తృతీయ శ్రేణి పట్టణాల్లో ఈ నియామకాలు ఉంటాయని పేర్కొంది.

నేడు జిల్లాలో కేంద్ర మంత్రుల పర్యటన

- వరద ప్రాంతాల్లో ఏరియల్ సర్వే
- పాలేరులో రైతులతో ముఖాముఖి

పాలేరులో రైతులతో ముఖాముఖి కార్యక్రమ స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, సీపీ సునీల్ దత్

ఖమ్మం(నమస్తే తెలంగాణ ప్రతినిధి), కూసుమంచి, సెప్టెంబర్ 5 : జిల్లాలో భారీ వర్షాలు, వరదలతో నష్టపోయిన ప్రాంతాల్లో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ శుక్రవారం ఏరియల్ సర్వే నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు విజయవాడ నుంచి కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ నేరుగా ఖమ్మం వస్తుండగా.. బండి సంజయ్ ఆయనతో కలిసి వరద ప్రభావిత ప్రాంతాల్లో ఏరియల్ సర్వే చేయనున్నారు. అనంతరం శివరాజ్ సింగ్ పాలేరులో దెబ్బతిన్న ప్రాంతాలను పరిశీలించి.. రైతులతో ముఖాముఖి నిర్వహించనున్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. అనంతరం మంత్రి బండి సంజయ్ ఖమ్మంలోని 30వ డివిజన్ మోతినగర్, 35వ డివిజన్ పంపింగ్ వెల్ రోడ్‌లోని పెద్దమ్మ తల్లి ఆలయ సమీప ప్రాంతాల్లో పర్యటిస్తారు. కాగా.. పాలేరులో జరిగే కార్యక్రమ ఏర్పాట్లపై కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, సీపీ సునీల్‌దత్ అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మధుసూదన్ నాయక్, డాక్టర్ పి.శ్రీజ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పుల్లయ్య, ఈఈలు మంగలపుడి వెంకటేశ్వర్లు, అనన్య, డీఇలు రమేశ్ రెడ్డి, మధు, ఏడీఏ సరిత ఏవో వాణి, తహసీల్దార్ సురేశ్‌కుమార్, ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి, సీఐ సంజీవ్‌కుమార్ పాల్గొన్నారు

శాంతించిన పాలేరు

కూసుమంచి, సెప్టెంబర్ 5: పాలేరుకు ఏనాడూ లేని విధంగా 1.97 లక్షల క్యూసెక్కుల వరద నీరు ప్రవహించడంతో సుమారు 30 టీఎంసీల నీరు దిగువకు వదిలారు. ప్రధాన కాలువకు గండి పడటంతోపాటు మినీహైడెల్ ప్రాజెక్టు వద్ద కాలువకు గండి పడడంతో పాలేరు నీరు కిందకు పోతుంది. ప్రస్తుతం నీటి మట్టం 21.5 అడుగులుగా ఉంది. పూర్తిస్థాయి నీటి మట్టం 23 అడుగులు ఉంది.

పాలేరు పరిస్థితి..

- పాలేరు పూర్తి నీటి మట్టం 23 అడుగులు ప్రస్తుతం 21.5 అడుగులు
- పూర్తి కెపాసిటీ 2.55 టీఎంసీలు ప్రస్తుత సామర్థ్యం 2.229 టీఎంసీలు
- పాలేరుకు వచ్చే నీరు 3,250 క్యూసెక్కులు
- పాలేరు ప్రధానకాలువ ద్వారా 2,000 క్యూసెక్కులు
- గండి పడిన ప్రాంతం నుంచి 1,112 క్యూసెక్కులు
- మిషన్ భగీరథకు 135 క్యూసెక్కులు నీటిని వదులుతున్నారు.

ముంపు బాధితుల సాయంపై ఎస్‌బీఎం డైరెక్టర్ ఆరా

ఖమ్మం రూరల్, సెప్టెంబర్ 5: వరద ముంపు బాధితులకు అందుతున్న సాయంపై గురువారం స్వచ్ఛ భారత్ మిషన్(ఎస్‌బీఎం) డైరెక్టర్ సురేష్ బాబు ఆరా తీశారు. మండలంలోని రాజీవ్ గృహకల్ప, వాల్యా తండ, కాచిరాజుగూడెం, కస్నాతండా, తనగంపాడు, జలగంనగర్, నాయుడుపేట, పెద్దతండా, కేబీఆర్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఆయన స్థానిక అధికారులతో కలిసి పర్యటించారు. బాధితుల ఇంటింటికెళ్లి అందిన సహాయం గురించి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీడీఓ ఎస్ కుమార్, ఎంపీవో రాజారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆరుగురు మావోయిస్టులు హతం

- **ఆరుగురిలో ఇద్దరు మహిళా మావోయిస్టులు**
- **ఘటనా స్థలం నుంచి తప్పించుకున్న ఒక మావోయిస్టు**
- **ఇద్దరు గ్రేహౌండ్స్ పోలీసులకు తీవ్ర గాయాలు**
- **భద్రాచలం ఏరియా ఆస్పత్రికి చికిత్స కోసం తరలింపు**
- **వివరాలు వెల్లడించిన భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు**

కరకగూడెం, సెప్టెంబర్ 5 : తెల్లవారుజామునే తుపాకీల మోతలతో ఏజెన్సీ ప్రాంతం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. పచ్చని చెట్లపై రక్తపు మరకలు చిందించింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం మండలం రాఘునాథపాలెం, మోతే, తాటిగూడెం సరిహద్దు అటవీ ప్రాంతంలో మావోయిస్టులు, గ్రేహౌండ్స్ బలగాలకు మధ్య గురువారం తెల్లవారుజామున జరిగిన ఎదురుకాల్పుల్లో ఆరుగురు మావోయిస్టులు హతమయ్యారు. భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు కథనం ప్రకారం.. సరిహద్దు అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు గ్రేహౌండ్స్ పోలీసులు అడవిని జల్లెడ పడుతున్నారు. ఈ క్రమంలో మావోయిస్టులు గ్రేహౌండ్స్ బలగాలను గమనించి వారి పైకి కాల్పులకు దిగారు. దీంతో అప్రమత్తమైన గ్రేహౌండ్స్ బలగాలు ఎదురుకాల్పులకు దిగాయి. దీంతో ఇరువర్గాల మధ్య హోరాహోరీ పోరు జరిగింది. అనంతరం కాల్పుల విరమణ తర్వాత ఘటనా స్థలాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్న గ్రేహౌండ్స్ బలగాలు పరిశీలించగా.. ఆరుగురు మావోయిస్టుల మృతదేహాలు లభ్యంకాగా.. అందులో ఇద్దరు మహిళా మావోయిస్టులు ఉన్నారు. మృతుల్లో మావోయిస్టు పార్టీ అగ్రనేత, మణుగూరు ఏరియా కార్యదర్శి లచ్చన్న దంపతులు ఉన్నారు. వీరిపై రివార్డులు ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. ఘటనా స్థలం నుంచి ఏకే 47 తుపాకులు 2, ఎస్ఎల్ఆర్ 1, 303 రైఫిల్ 1, పిస్టల్ 1, మ్యాగ్జిన్‌తోపాటు లైవ్ రౌండ్లు, కిట్ బ్యాగులు, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎదురుకాల్పుల్లో ఇద్దరు గ్రేహౌండ్స్ పోలీసులకు తీవ్ర గాయాలు కావడంతో భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్పీ తెలిపారు. ఒక మావోయిస్టు పారిపోయినట్లు ఎస్పీ చెప్పారు. ఇన్నాళ్లు ప్రశాంతంగా ఉన్న ఏజెన్సీ ప్రాంతంలో ఆరుగురు మావోయిస్టుల మృతితో ప్రజలు భయం గుప్పిట్లో గడుపుతున్నారు.

ఎన్‌కౌంటర్లు దుర్మార్గం

– సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెంలో గురువారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆరుగురు మావోయిస్టులు మృతిచెందిన విషయం పాఠకులకు తెలిసిందే. ఈ ఎన్‌కౌంటర్‌పై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు స్పందించారు. 'మన జిల్లాలో ఆరుగురు, ఛత్తీస్‌గఢ్‌లో తొమ్మిది మంది మావోయిస్టులను మట్టుబెట్టారు. ఇలాంటి ఎన్‌కౌంటర్లు దారుణం' అని పేర్కొన్నారు. 2026 నాటికి మావోయిస్టులను ఏరివేస్తామని కేంద్ర మంత్రి అమిత్‌షా ప్రకటించిన నేపథ్యంలో ఇలాంటి ఎన్‌కౌంటర్లు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వాళ్లు (మావోయిస్టులు) తప్పులు చేసినట్లయితే కోర్టులు చూసుకుంటాయని పేర్కొన్నారు. కానీ, కోర్టులతో సంబంధం లేకుండా ఏకంగా 'ఏరివేస్తా'మని కేంద్రం ప్రకటించడం, దానికి అనుగుణంగానే ఎన్‌కౌంటర్ల పేరిట మావోయిస్టులను బలిగొనడం సరికాదని, దీనిని తాము ఖండిస్తున్నామని పేర్కొన్నారు. కేంద్రం పన్నిన ఉచ్చులో పడకూడదని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. పౌర హక్కుల సంఘం నాయకులైన వరవరరావు, సాయిబాబా వంటి వారిని కేంద్రం ఎలా నిర్బంధించిందో గమనించాలని కోరారు.

ఎన్‌కౌంటర్‌కు ముగ్గురు మంత్రులు బాధ్యత వహించాలి

ఎన్‌కౌంటర్‌లో ఓ గ్రామస్తుడిని కూడా హత్య చేశారు?
మావోయిస్టు పార్టీ బీకే-ఏఎస్ఆర్ కార్యదర్శి ఆజాద్ పేరుతో లేఖ విడుదల

కొత్తగూడెం క్రైం, సెప్టెంబర్ 5 : రఘునాథపాలెం ఎన్‌కౌంటర్‌కు కాంగ్రెస్ ప్రభుత్వంతోపాటు జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు బాధ్యత వహించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న హత్యలకు సమాధానంగా త్వరలోనే నెత్తుటి బాకీ తీర్చుకుంటామని హెచ్చరిస్తూ మావోయిస్టు పార్టీ భద్రాద్రి కొత్తగూడెం-అల్లూరి సీతారామరాజు డివిజన్ కమిటీ కార్యదర్శి ఆజాద్ పేరుతో గురువారం లేఖ విడుదలైంది. కరకగూడెం మండలం రఘునాథపాలెం అడవుల్లో విప్లవ ద్రోహులు ఇచ్చిన సమాచారంతో జరిగిన ఎదురు కాల్పుల్లో ఆరుగురు కామ్రేడ్‌లతోపాటు ఓ గ్రామస్తుడు సైతం చనిపోయినట్లు లేఖలో పేర్కొన్నారు. ఎదురు కాల్పుల్లో రాయిగూడెం, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం డివిజన్ కమిటీ సభ్యుడు లచ్చన్న, ఆయన సతీమణి తులసి అలియాస్ పూనెం లక్కీ, పాల్వంచ-మణుగూరు ఏరియా కమిటీ కమాండర్ రాము, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కోమటిపల్లికి చెందిన పార్టీ సభ్యురాలు కోసి, గంగాల్, పార్టీ సీనియర్ సభ్యుడు, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బొట్టెం గ్రామానికి చెందిన దుర్గేశ్‌తోపాటు ఒక గ్రామస్తుడిని సైతం పోలీసులు ఎన్‌కౌంటర్ పేరుతో హత్య చేశారని లేఖలో ఆరోపించారు. మావోయిస్టు పార్టీపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమిత్ షా ఆధ్వర్యంలో నిరంతరం దాడులకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. పార్టీని నిర్మూలించడానికి రెండు ప్రభుత్వాలు చేస్తున్న హత్యలను ప్రజలు గమనిస్తున్నారని, ఇలాంటి బూటకపు ఎన్‌కౌంటర్లు, దాడులకు మావోయిస్టు పార్టీ భయపడదన్నారు.

9న బంద్‌కు పిలుపు

రఘునాథపాలెం ఎన్‌కౌంటర్‌కు నిరసనగా ఈ నెల 9న బంద్‌కు పిలుపునిస్తున్నట్లు లేఖలో పేర్కొన్నారు. ప్రజలు, వ్యాపార సంస్థలు బంద్‌కు సహకరించాలని కోరారు. ఈ ఎన్‌కౌంటర్‌ను ప్రజలు, ప్రజాస్వామికవాదులు ఖండించాలని పిలుపునిచ్చారు.

సోలార్ ప్లాంట్ ఎదుట సెక్యూరిటీ గార్డుల ధర్నా

కారేపల్లి, సెప్టెంబర్ 5: సింగరేణికాలరీస్ ఆధ్వర్యంలోని ఉసిరికాయలపల్లి సోలార్ ప్లాంట్‌లో పని చేస్తున్న 35 మంది సెక్యూరిటీ గార్డులను అక్రమంగా తొలగించడాన్ని నిరసిస్తూ గురువారం సోలార్ ప్లాంట్ ప్రధాన గేటు ఎదుట సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. సింగరేణి ఓసీ భూనిర్వాసితులు, ఓసీ ప్రభావిత ప్రాంతాలకు చెందిన యువకులు 8 నెలలుగా సోలార్‌ప్లాంట్‌లో సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తున్నారని, వారిని ఆకస్మికంగా తొలగించడంపై కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సెక్యూరిటీ గార్డుల ఆందోళనకు వివిధ పార్టీల నాయకులు సంఘీభావం తెలిపారు. సింగరేణి జీఎం, సోలార్ కాంట్రాక్టర్ అనిల్‌తో ఫోన్‌లో సీఐ మాట్లాడారు. దీనిపై సింగరేణి కాలరీస్ జీఎం శనివారం వరకు గడువు కోరడంతో అప్పటి వరకు ఆందోళన విరమించాలని కార్మికసంఘాల నాయకులను సీఐ కోరారు. దీంతో ఆందోళనను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన 'వద్దిరాజు'

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎంపీ వద్దిరాజు

ఖమ్మం, సెప్టెంబర్ 5: తన సిఫార్సు మేరకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర.. ఆయా లబ్ధిదారులకు అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతూ అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందిన పలువురు బాధితులు.. సహాయాన్ని అర్థిస్తూ ఎంపీ రవిచంద్ర ద్వారా ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. దీంతో ప్రత్యేక చొరవ తీసుకున్న ఎంపీ వద్దిరాజు.. 20 మందికి రూ.5.85 లక్షల సీఎంఆర్ఎఫ్‌ను మంజూరు చేయించారు. ఆయా చెక్కులను ఖమ్మంలోని తన కార్యాలయంలో ఆయా లబ్ధిదారులకు గురువారం పంపిణీ చేశారు.

డీసీసీబీ పాలకవర్గ సమావేశం

ఖమ్మం వ్యవసాయం, సెప్టెంబర్ 5: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) పాలకవర్గ సమావేశం గురువారం జరిగింది. నగరంలోని బ్యాంకు బోర్డు సమావేశ మందిరంలో చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గత బోర్డు సమావేశంలో ప్రవేశపెట్టిన తీర్మానాలు, వాటి పురోగతిపై చర్చించినట్లు సమాచారం. అదేవిధంగా ఇటీవల డీసీసీబీ సీఈవో, జీఎంలపై సహకార శాఖ అధికారులు వేసిన సస్పెన్షన్ వేటు నిర్ణయాన్ని పాలకవర్గం ఏకగ్రీవంగా ఆమోదించినట్లు తెలిసింది. అలాగే, సొసైటీ సభ్యులకు సంబంధించి ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్‌తో చేసుకున్న ఒప్పందాలు, తద్వారా జరిగిన లావాదేవీలు, ఉద్యోగుల ప్రోత్సాహకాలు తదితర అంశాలపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని డైరెక్టర్లందరూ పట్టుబట్టడంతో పాలకవర్గంలో ఏకగ్రీవ తీర్మానం చేసినట్లు విశ్వసనీయ సమాచారం. అయితే, డీసీసీబీలో ఖాళీ అయిన డైరెక్టర్ల స్థానాల ఎంపికతోపాటు నూతన చైర్మన్ ఎన్నిక వంటివి ప్రధాన అంశాలపై గడిచిన మూడు సమావేశాలూ వాయిదా పడిన విషయం విదితమే. కాగా, ఈ సమావేశంలో డైరెక్టర్లెవరూ ఆ అంశంపై మాట్లాడకపోవడం గమనార్హం.

రాష్ట్రపతి నుంచి అవార్డు అందుకున్న ప్రభాకర్‌రెడ్డి



రాష్ట్రపతి చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న పెసర ప్రభాకర్‌రెడ్డి

ఖమ్మం ఎడ్యుకేషన్, సెప్టెంబర్ 5 : జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు పెసర ప్రభాకర్‌రెడ్డి గురువారం ఢిల్లీలో రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. తన ఉద్యోగ జీవితంలో రాష్ట్రపతి చేతుల మీదుగా అత్యున్నత పురస్కారం అందుకోవడం గర్వంగా ఉందని ఆయన తెలిపారు.

రాష్ట్రస్థాయి అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులు



గురుపూజోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న జి.వెంకటేశ్వర్లు, కె.ఓంకార్, ఎం.సింహాచలం, ఉమాదేవి.